క్లుప్తంగా

ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు



పామర్రు: నియోజకవర్గంలోని ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలను పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ తెలిపారు. రంజాన్ పండుగను గురువారం ప్రతిఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలని పేర్కొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



ముదినేపల్లి రూరల్ : వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా మండలస్థాయి అధికారులు సత్వరమే చర్యలు తీసుకోవాలని ఏలూరు ఆర్డీఓ ఎస్కే ఖాజావలి అన్నారు. మండలంలో తాగునీటి పరిస్థితిపై ఆరా తీసేందుకు ఆర్డీఓ బుధవారం పర్యటించి శ్రీహరిపురం వద్ద క్యాంపుబెల్ కెనాల్‌లో నీటి ప్రవాహాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడారు. కాలువలకు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేస్తున్నందున మంచినీటి చెరువులు వెంటనే నింపేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీటిని అక్రమ పద్ధతుల్లో ఎవరైనా చేపల చెరువులకు మళ్లిస్తే కేసులు నమోదు చేయాలని సూచించారు. ఎంపీడీఓ గంగాధరరావు, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు ఆర్డీఓ వెంట ఉన్నారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి



తోట్లవల్లూరు: మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శీలం ప్రకాశరావు విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కుసుమకుమారిని బుధవారం కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. మండల వ్యాప్తంగా రైతులు, కౌలురైతులు 3,500 ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశారని, ప్రస్తుతం పంట కోత దశకు వచ్చిందని ప్రకాశరావు తెలిపారు. అధికారులు వెంటనే మొక్కజొన్న విక్రయించుకునేందుకు అవసరమైన కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. దళారులతో రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. రైతులు వీరంకి రామకృష్ణ, డొక్కు బాబూరావు, చోరగుడి నాగేశ్వరరావు, కోటయ్య పాల్గొన్నారు.

కొవ్వాడలంకలో కళాజాత



మండవల్లి: కొవ్వాడలంక, చింతపాడు గ్రామాల్లో ఏలూరు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం కళాజాత స్థానిక ఎంపీడీఓ ఆధ్వర్యంలో, కార్యదర్శి పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతిఒక్కరూ మే 13న ఓటు వేసి బాధ్యత నిర్వర్తించాలన్నారు. మద్యానికి, డబ్బుకి, వివిధ రకాల బహుమతులకు, ప్రలోభాలకు లోనుకాకుండా విలువలతో కూడిన ఓటును ప్రతిఒక్కరూ వేయాలని పేర్కొన్నారు. కళాకారులు వై వీరయ్య వై రవితేజ పాల్గొన్నారు.

పాఠశాలల్లో క్రమం తప్పకుండా వాటర్ బెల్



కలిదిండి: వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఎండ వేడిమికి విద్యార్థుల్లో డీహైడ్రేషన్ ముప్పును నివారించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో రోజుకు మూడు సార్లు (9.45, 10.05, 11.50 గంటలకు) వాటర్ బెల్ మోగించాలని ఎంఈఓ పి. ప్రభాకర్‌రావు తెలిపారు. తాడినాడ ప్రభుత్వ పాఠశాలలో వాటర్ బెల్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఏప్రిల్ 23 వరకు రోజూ వాటర్ బెల్ కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు.

ఆకట్టుకున్న ప్రవచనం

మచిలీపట్నంటౌన్: టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని చిలకలపూడి శ్రీ విజయ సీతారామస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ప్రవచన కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. 'శ్రీరామనవమి పండుగ ప్రాశస్త్యం' అనే అంశంపై జి వెంకటేశ్వరరావు చేసిన ప్రవచనం భక్తులకు పలు విషయాలను తెలిపింది. కార్యక్రమాన్ని టీటీడీ ప్రతినిధి తురగా ప్రసాద్ పర్యవేక్షించారు.

జోరుగా ఎమ్మెల్యే కొడాలి నాని ప్రచారం



గులాబీ గజమాలతో ఎమ్మెల్యే కొడాలి నానికి సత్కారం



20వ వార్డులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడ టౌన్: గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ఎన్నికల ప్రచారం బుధవారానికి 15వ రోజుకు చేరుకుంది. రోజు రెండు వార్డుల చొప్పున తన అభిమానులను, ఓటర్లను కలుస్తూ ఆయన ప్రచారం జోరుగా కొనసాగిస్తున్నారు. బుధవారం 20, 21 వార్డుల్లో ఎన్నికల ప్రచారం కొనసాగింది. 20వ వార్డు ఇన్‌చార్జి దండమూడి శేష గిరిరావు (గిరిబాబాయ్) ఆధ్వర్యంలో ఆర్టీసీ కాలనీ, ఆటోనగర్‌లో ఉదయం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింట తిరుగుతూ వైఎస్సార్ సీపీ శ్రేణులను పలకరిస్తూ ప్రచారం సాగింది. అభిమానులు గజమాలలతో సత్కరించారు. ఆర్టీసీ కాలనీలో ఓ అభిమాని గులాబీ గజమాలతో ఎమ్మెల్యేను సత్కరించారు. మహిళలు వీధి వీధికి హారతులు పడుతూ స్వాగతం పలికారు. అన్నివర్గాల ప్రజానీకంతో కలిసి మమేకమవుతూ ఓట్లను అభ్యర్థిస్తూ ప్రచారం చేశారు. పలు చోట్ల వార్డు పెద్దలు, నాయకులు కొడాలి నానిని తమ ఇళ్లకు ఆహ్వానించి ఎన్నికల వ్యూహంపై సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన 99 శాతం హామీలను అమలు చేశామన్నారు. మాట తప్పని మడమ తిప్పని జగన్‌మోహన్‌రెడ్డి కులం, మతం, పార్టీ, ప్రాంతాలకు అతీతంగా అన్ని పథకాలు అర్హులకు అందేలా పాలించిన నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అనే అన్నారు. గడప గడపకు పింఛన్లు అందజేసిన ఘనత భారతదేశంలో జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అందరి ఆశీస్సులతో మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. పలువురు ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, పార్టీ వివిధ శాఖల ప్రతినిధులు, వార్డు ప్రముఖులు, అభిమానులు పాల్గొన్నారు.

వలంటీర్లపై విమర్శలు చేయడం సరికాదు

నందివాడ: పేదలకు నిస్వార్థంగా సేవలదిస్తున్న వలంటీర్లపై చంద్రబాబునాయుడు, నారా లోకేష్ విమర్శలు చేయడం సరికాదని వలివర్తిపాడు గ్రామానికి చెందిన పలువురు వలంటీర్లు విమర్శించారు. తమపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని, దీనికి నిరసనగా మండలంలోని వలివర్తిపాడు గ్రామానికి చెందిన 18మంది వలంటీర్లు మూకుమ్మడిగా బుధవారం రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ కె.జ్యోతికి అందచేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు కె.సందీప్, జి.రామయ్య, ఆనందబాబు మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా ఉంటూ సేవలందిస్తున్న తమపై నిత్యం అసత్య ఆరోపణలు చేయడంతో మనస్తాపం చెందిన తాము ఉద్యోగాలకు రాజీనామా చేశామని తెలిపారు. పెన్షన్ల పంపిణీపై కోర్టులో స్టే వేసిన చంద్రబాబు అండ్ టీంకు రానున్న ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. తమ ఉసురు తగలకుండా ఉండబోదన్నారు. వలంటీర్లు నాగవర్ధన్, సీహెచ్ రేవతి, సీహెచ్ రమ్య, బి.నాగమణి, జి.సునంద, జి.కుసుమ, ఎస్.శిరీష, యు.వరమణి, పి.హరిత, డి.అనూష, వై.రాణి, కె.స్వాతి, జి.సంధ్య, బి.సుదాకర్, ఎం.లిల్లీదేవి రాజీనామా చేసిన వారిలో ఉన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకోండి

గుడివాడ టౌన్: గుడివాడ నియోజకవర్గ పరిధిలో ఎలక్షన్ డ్యూటీ పడిన పీఓలు, ఏపీఓలు, ఓపీఓలు పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్డీఓ పి. పద్మావతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫారం-12 లో తమ వివరాలు నింపి ఎలక్షన్ డ్యూటీ ఆర్డర్ కాపీ, ఓటరు కార్డు జిరాక్స్ జతచేసి గుడివాడ రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ కలెక్షన్ డెస్క్‌కు శుక్రవారం సాయంత్రంలోగా అందజేయాలని ఆమె కోరారు.

నీటిని నింపేందుకు ఏర్పాట్లు పూర్తి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

గుడివాడ టౌన్: పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు పూర్తి ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విజయదుర్గ అన్నారు. బుధవారం వారు నీటిని నింపే ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు రోజులుగా ఇక్కడ ర్యాపిడ్ స్పీడ్‌లో నీటిని నింపేందుకు కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని నీటిని నింపేందుకు మోటార్లను ఒకసారి పరీక్షించినట్లు తెలిపారు. ఇరిగేషన్ శాఖవారు ఈనెల 12న కాలువలు వదులుతున్న నేపథ్యంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది నీటిని నింపేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో డీఈ వెంకటరాజు , ఏఈ ప్రభాకర్ పాల్గొన్నారు.

'నాకు తెలిసిన నాలుగుమాటలు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

గుడివాడ టౌన్: ప్రముఖ కవి రచయిత వసుధ బసవేశ్వరరావు రచించిన 'నాకు తెలిసిన నాలుగుమాటలు' పుస్తకాన్ని భారతీ సమితీ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎన్జీఓ హోమ్‌లో బుధవారం ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన విశ్రాంత డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎంవీజే ఆంజనేయులు మాట్లాడుతూ విశ్వకర్మ బ్రాహ్మణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తూ తనలో దాగిఉన్న రచయితను బయటకు తీసి పలు పుస్తకాలు రచిస్తున్న వసుధ బసవేశ్వరరావు రచించిన ఈ పుస్తకం పాఠకులను విశేషంగా ఆకర్షిస్తుందని ఆకాంక్షిస్తున్నామన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఎంఈఓ భవిరి శంకరనాథ్, వంగిపురపు వీర రాఘవాచారి, డాక్టర్ రావి రంగారావు, డీఆర్‌బీ ప్రసాదు పాల్గొన్నారు.

కొడాలి నానికి 'నుగలాపు' పూర్తి మద్దతు



కొడాలి నానికి హామీ ఇస్తున్న నుగలాపు వెంకటేశ్వరరావు

గుడివాడ టౌన్: గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) విజయానికి తన పూర్తి మద్దతు, సహకారం ఉంటుందని మున్సిపల్ మాజీ చైర్మన్ నుగలాపు వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా శ్రీ శ్రీనివాస ఆటో ఇంజనీరింగ్ వర్క్స్‌లో కొడాలి నాని నుగలాపు వెంకటేశ్వరరావు మద్దతు కోరారు. ఈ సందర్భంగా కొడాలి నాని మాట్లాడుతూ 2000 సంవత్సరానికి ముందు నుగలాపు వెంకటేశ్వరరావు కమ్యూనిస్ట్ భావాలతో ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో మంచినీటి ట్యాంక్‌లు ఏర్పాటు చేసి పట్టణ ప్రజలకు ఉచితంగా మంచినీరు పంపిణీ చేశారన్నారు. అనంతరం జరిగిన మున్సిపల్ ఎన్నికలు ప్రత్యక్ష ఎన్నికలు కావడం నుగలాపు ప్రజలకు చేసిన మంచి పనిని ప్రజలు గుర్తించారన్నారు. అప్పుడు టీడీపీ అధికారంలో ఉన్నప్పటికీ పట్టణ ప్రజలు ఆయనను మున్సిపల్ చైర్మన్‌గా భారీ మెజార్టీతో గెలిపించారన్నారు. దానిని స్ఫూర్తిగా తీసుకున్న నేను రాజకీయాలకు అతీతంగా గుడివాడ నియోజకవర్గ ప్రజలందరికీ ఉచితంగా తాగునీటిని సరఫరా చేయాలని నిర్ణయించుకుని సేవలు ప్రారంభించానన్నారు. అదేవిధంగా తన సేవలు కొనసాగించి ప్రజల మద్దతుతో ఎమ్మెల్యేగా గెలిచానన్నారు. దీనిని పురస్కరించుకుని నుగలాపు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సేవచేసిన ఏ నాయకుడినీ ప్రజలు మర్చిపోరన్నారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి తీసుకున్న ఒక గొప్ప నిర్ణయం పురపాలక సంఘాల రూపురేఖలు మార్చేశాయన్నారు. నేను చైర్మన్ పదవి చేపట్టినప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును పురపాలక సంఘ పాఠశాలల్లో బాలికలకు మరుగుదొడ్లు లేక మూత్ర విసర్జనకు కూడా ఇబ్బందిపడుతున్నారు మూత్రశాలలను కట్టించాలని కోరగా ప్రభుత్వ సొమ్ము పురపాలక సంఘాలకు ఇచ్చే అవకాశం లేదని నిధులు కేటాయించలేదన్నారు. మున్సిపల్ నిధులతోనే ఏర్పాటు చేసుకోవాలని సలహా ఇచ్చారన్నారు. ఆడపిల్లలు బహు ఇబ్బంది పడేవారన్నారు. రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పురపాలక సంఘంలో వసతులు ఏర్పాటుతో పాటు పురపాలక సంఘ ఉద్యోగుల జీతాలు సైతం ప్రభుత్వమే భరించేలా జీఓను తెచ్చి పురపాలక సంఘాల రూపురేఖలు మార్చేశారన్నారు. ఈ విధమైన ఎన్నో గొప్ప కార్యక్రమాలు చేశారు కనుకనే ప్రజలు రాజశేఖరరెడ్డిని ఇప్పటికి గుర్తుంచుకున్నారన్నారు. అదే విధంగా ప్రజలకు మంచి జరిగే పనులు చేస్తున్నారు కనుక ఆయన కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డిని కూడా ప్రజలు ఆదరిస్తారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడం కాయమని కొడాలి నానికి తన పూర్తి మద్దతు ఉంటుందని నుగలాపు అన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



కొండిపర్రు(పామర్రు): బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయుక్తం అవుతాయని ఎండోమెంట్ అధికారి సలాది వెంకట సుబ్బారావు తెలిపారు. మండలంలోని కొండిపర్రు గ్రామంలో శ్రీ ధర్మ చెరువు తరపున విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి పక్కన బుధవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చెరువు నుంచి వచ్చిన ఫలసాయంలో కొంత భాగంతో గ్రామంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. చలివేంద్రం ద్వారా కూలింగ్ వాటర్‌ను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. తొలిరోజు మజ్జిగ పంపిణీ చేశామన్నారు. మల్లేశ్వర స్వామి ఆలయ అర్చకులు వెంకటరామారావు, సిబ్బంది రవయ్య, వీరరాఘవయ్య పాల్గొన్నారు.

సంక్షేమానికి సీఎం జగన్ ప్రాధాన్యం



స్తంభంచెరువులో ప్రచారం చేస్తున్న దూలం స్వాతి, నాయకులు

ముదినేపల్లి రూరల్: పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగనన్న ప్రాధాన్యం ఇచ్చారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కోడలు దూలం స్వాతి, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ అన్నారు. మండలంలోని శ్రీహరిపురం శివారు స్తంభంచెరువులో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), కారుమూరి సునీల్‌కుమార్‌యాదవ్‌ను గెలిపించాలని కోరుతూ ఆమె ఎన్నికల ప్రచారాన్ని బుధవారం నిర్వహించారు. హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీలు చొప్పర్ల సునీత, రాచూరి రాధా, పార్టీ నాయకులు మోట్రు ఏసుబాబు, కోమటి విష్ణువర్ధన్, పేర్ని పృథ్వీ పాల్గొన్నారు.

మంచి చేసిన నాయకులకు పట్టం కట్టండి



వేమవరప్పాడులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్ సతీమణి వీరాకుమారి

కైకలూరు: మంచి చేసిన నాయకులకు పట్టం కట్టాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) సతీమణి వీరాకుమారి కోరారు. వేమవరప్పాడులో బుధవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ నుంచి ఎమ్మెల్యేగా దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎంపీగా కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌కు అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ నున్న రాంబాబు, ఉప సర్పంచ్ జాజుల రాజు, గోపవరం సర్పంచ్ ఉలసి వసంతకుమారి, పంజా నాగు, బందా నారాయణ, విమల్ పాల్గొన్నారు.

శ్రీనివాసరెడ్డికి సన్మానం



శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న కళాపీఠం అధ్యక్షుడు మురళీకృష్ణ

పామర్రు: ఎరువులు, పురుగు మందులు, విత్తనాల డీలర్స్ సంక్షేమ అసోసియేషన్‌కు రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గ్రామానికి చెందిన వ్యాపారవేత్త భీమవరపు శ్రీనివాసరెడ్డిని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నేపథ్యంలో పామర్రు ఘంటసాల కళాపీఠం అధ్యక్షుడు కాటూరి వెంకటమురళీకృష్ణ ఆధ్వర్యంలో శ్రీనివాసరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ సేవా గుణం కల్గిన వ్యక్తి శ్రీనివాసరెడ్డి అన్నారు. రానున్న కాలంలో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో కళాపీఠం సభ్యులు కోటి పాండురంగారావు, మహదేవ్ రాజు, సాల్మన్ కొల్లబత్తుల తదితరులు శ్రీనివాసరెడ్డిని అభినందించారు.

పంట కాలువలను కలుషితం చేయొద్దు

కైకలూరు: పంట కాలువల్లో చెత్త చెదారం, క్యారీ బ్యాగులు, మద్యం సీసాలు విసరడం, మురికి నీటి డ్రెయినేజీ పైపులు అనుసంధానించడం వంటివి చెయొద్దని కైకలూరు సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి పేర్కొన్నారు. కైకలూరు చానల్‌లో 15 రోజులుగా నిర్వహిస్తున్న చెత్త తొలగింపు పనులను ఆమె బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కైకలూరు చానల్ కాల్వ గట్లు వెంబడి నివసిస్తున్న ప్రజలు ఇష్టానుసారంగా కాలువల్లో వ్యర్థాలను విడిచిపెడుతున్నా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. రెండు రోజుల్లో కాలువల ద్వారా వచ్చే నీటితో మంచినీటి చెరువులను నింపుతామని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ పీవీ శ్యామలరావు, జూనియర్ అసిస్టెంటు ఎం.రవికుమార్, సిబ్బంది అశోక్, శివ, అనిల్ పాల్గొన్నారు.

నవరత్నాలతో నవశకానికి నాంది

ఎమ్మెల్యే డీఎన్నార్



మండవల్లిలో గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో పార్టీ శ్రేణులతో ఎమ్మెల్యే డీఎన్నార్

మండవల్లి: నవరత్నాలతో నవ శకానికి నాంది పలికిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. మండవల్లిలోని 4,5,11 వార్డుల్లో మూడో రోజు బుధవారం ఆయన గుడ్ మార్నింగ్ మండవల్లి కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ప్రజలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అవినీతికి తావు లేకుండా ప్రజారంజక పాలన చేస్తున్న వైఎస్ జగన్‌ను ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని కోరారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, మండల పార్టీ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, సర్పంచ్ మెండా ఝాన్సీ, సురేష్, వైస్ ఎంపీపీ అగస్తి ఆదివిష్ణు, సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు యేసోబురాజు, నాయకులు మల్లికార్జునరావు, గోకర్ణ, సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షుడు సత్యప్రసాద్(బాబీ), ఆలయ చైర్మన్ కొల్లా కృష్ణ, జిల్లా వైఎస్సార్ సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు, మాజీ ఎంపీపీ ముంగర గోపాలకృష్ణ, సర్పంచ్‌లు భోగేశ్వరరావు, శేషగిరిరావు, వీరబాబు, థామస్‌లు, కుమారస్వామి పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి జరగాలంటే వైఎస్సార్ సీపీ మళ్లీ రావాలి



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్, ఎమ్మెల్యే అనిల్‌కుమార్

కూచిపూడి(మొవ్వ): సంక్షేమం, విద్య, వైద్యంతో పాటు అభివృద్ధి జరగాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ పేర్కొన్నారు. మొవ్వ మండలం కూచిపూడిలోని ఎస్ఎస్ఎల్ కన్వెన్షన్ హాల్లో బుధవారం జరిగిన మొవ్వ మండల బూత్ కమిటీలు, కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్, ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ హాజరయ్యారు. వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ మాట్లాడుతూ ఇచ్చిన హామీలను 99శాతం అమలు చేసిన ఏకైక నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. కులం, మతం, పార్టీల తారతమ్యాలు లేకుండా అర్హులందరికీ సంక్షేమ ఫలాలను అందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాట పార్వతి, ఎంపీపీ కొండేటి ఇందిర, వైస్ ఎంపీపీ కందుల వెంకట కోటేశ్వరరావు, నాయకులు గోగినేని పెరుమాళ్లు, మండ శ్రీనివాస రెడ్డి, కాకర్ల చిట్టిబాబు(శివకుమార్), పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సొసైటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

పార్టీ కార్యాలయం ప్రారంభం

పెదపూడి ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన మొవ్వ మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్, పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. పార్టీ నాయకులు కార్యకర్తతో మమేకమయ్యారు. అనంతరం కూచిపూడి-పెదపూడి ప్రధాన కూడలిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి, డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూల మాలలేసి నివాళులు అర్పించారు.

వైఎస్సార్ సీపీ నాయకుడి కుటుంబానికి పరామర్శ

కైకలూరు: వైఎస్సార్ సీపీ నాయకుడు కలిదిండి మండలం సానారుద్రవరానికి చెందిన నున్న భగవాన్ తండ్రి రామారావు బుధవారం మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) ఆయన ఇంటికి వెళ్లి బుధవారం పరామర్శించారు. సంతోషపురంలో బొడ్డు రోజా మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. రోజా మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం చినతాడినాడ సమీప పల్లెపాలెంలో కొల్లాటి మహాలక్ష్మి, కైకలూరు మండలం భుజబలపట్నంలో రుద్రరాజు సహదేవరాజు దశ దిన కర్మ కార్యక్రమాలకు ఎమ్మెల్యే హాజరయ్యారు.

న్యాయవాదులకు అండగా సీఎం జగన్



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని, న్యాయవాదులు

గుడివాడ టౌన్: న్యాయవాదుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. బుధవారం స్థానిక రాజేంద్రనగర్‌లోని ఆయన నివాసంలో వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ఏర్పాటు చేసిన అనంతరం ఎన్నికల చట్టాలు, ప్రవర్తన నియమావళి బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి విషయంలోనూ ఆ సంస్థలలో వ్యక్తులు పడుతున్న ఇబ్బందుల పరిష్కారానికి జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచిస్తారన్నారు. న్యాయవాద డిగ్రీ పూర్తిచేసి పట్టా చేతికొచ్చాక సరైన ఆదరణ, ప్రాక్టీసు లేక ఎంతోమంది న్యాయవాదులు ఇతర వృత్తులకు వెళ్లిపోవడం గమనించిన జగన్‌మోహన్‌రెడ్డి వారిని ప్రోత్సహించేందుకు బార్‌లో సభ్యత్వం పొందిన నాటి నుంచి ఐదేళ్లపాటు నెలకు రూ. 5 వేలు ఇస్తూ వారిని ప్రోత్సహిస్తున్నారన్నారు. లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు పల్లపోతు అంకరాజు, ఉపాధ్యక్షుడు మట్టా రామరాజు, న్యాయవాదులు లోయ కనకలింగేశ్వరరావు, ఎంపీ నారాయణరెడ్డి పాల్గొన్నారు.

సీఎంగా జగన్, ఎమ్మెల్యేగా కొడాలి నాని గెలుపే లక్ష్యం



వలివర్తిపాడులో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్‌పర్సన్, ఎంపీపీలు

గుడివాడరూరల్: ముఖ్యమంత్రిగా రెండోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, గుడివాడ ఎమ్మెల్యేగా ఐదోసారి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) గెలుపే లక్ష్యంగా ఇంటింటి ప్రచారానికి శ్రీకారం చుట్టామని గుడివాడ మార్కెట్‌యార్డ్ చైర్‌పర్సన్ మట్టా నాగమణివిక్టర్, ఎంపీపీ గద్దే పుష్పరాణి పేర్కొన్నారు. మండలంలోని వలివర్తిపాడులో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్, జెడ్పీటీసీ సభ్యుడు గోళ్ల రామకృష్ణతో కలసి ఎన్నికల ప్రచారానికి బుధవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ప్రజలు తమ రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి మరోసారి ఆశీర్వదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శాయిన నాగబాబు, కండవల్లి రవికుమార్ పాల్గొన్నారు.